సాక్షి
నిజామాబాద్
బుధవారం। 6। మార్చి। 2024



ఉత్సాహంగా విద్యుత్ క్రీడలు

విద్యుత్ ఉద్యోగుల రాష్ట్రస్థాయి క్రీడలు జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఉత్సాహంగా కొనసాగుతున్నాయి.

- 8లో ▸



విద్యార్థులకు పోటీలు

నేషనల్ గ్రీన్‌కోర్ ఆధ్వర్యంలో కోటగల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.2 /21.5

వాతావరణం

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వీడియో కాన్ఫరెన్స్ సేవలను ప్రారంభించనున్న సీఎం

- జిల్లాలో సిద్ధమైన నాలుగు రైతు వేదికలు



డొంకేశ్వర్(ఆర్మూర్): రైతు వేదికల్లో అందుబాటులోకి వచ్చిన వీడియో కాన్ఫరెన్స్ సేవలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఇందుకు జిల్లాలో నాలుగు రైతు వేదికలను వ్యవసాయశాఖ అధికారులు సిద్ధం చేశారు. మెంట్రాజ్‌పల్లి, ఆర్మూర్, ముప్కాల్, ఎడపల్లి రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సదుపాయాలను ప్రభుత్వం కల్పించింది. పరికరాల కోసం ఒక్కో రైతు వేదికలో రూ. 22 లక్షలు వెచ్చించింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సేవలను వర్చువల్‌గా హైదరాబాద్ నుంచి సీఎం ప్రారంభించనున్న నేపథ్యంలో నిజామాబాద్ జిల్లాలో కూడా రైతు వేదికల్లో కూడా వీసీ సేవలను ప్రారంభించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు సేవలను ప్రారంభించిన అనంతరం సీఎం రైతులతో మాట్లాడే అవకాశం ఉంది. ఇందుకు రైతులను, ప్రజాప్రతినిధులను కార్యక్రమాలకు ఆహ్వానించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశాలందాయి.

సీఎంసీని సందర్శించిన కలెక్టర్, సీపీ



నిజామాబాద్ రూరల్: డిచ్‌పల్లిలోని సీఎంసీ కళాశాలను మంగళవారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సందర్శించారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా నిర్వహణ పరమైన ఏర్పాట్లలో భాగంగా ఓట్ల లెక్కింపు కోసం కాలేజీ అనుకూలంగా ఉంటుందని నిర్ణయించారు. ఓట్ల లెక్కింపు, ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూంలు, రవాణా, పార్కింగ్ సదుపాయాలను పరిశీలించారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్, స్ట్రాంగ్ రూంల కోసం అందుబాటులో ఉన్న గదులను పరిశీలించారు. భవనంలోని పలు గదుల్లో నిర్వహణపరమైన లోపాలు ఉండడంతో వాటిని శుభ్రం చేయించి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఫ్లోరింగ్, ఎలక్ట్రికల్ పనులను తక్షణమే ప్రారంభించాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ఆర్డీవో రాజేంద్రకుమార్, రాజాగౌడ్, మధుసూదన్, రోడ్లు భవనాల శాఖ ఎస్ఈ హనుమంత్ రావు, ట్రాన్స్‌కో ఎస్ఈ రవీందర్, జిల్లా అటవీ శాఖ అధికారి మురళి మనోహర్ రెడ్డి ఉన్నారు.

ధాత్రి టౌన్‌షిప్‌లో రైతుల భూమి

- పట్టించుకోని అధికారులు
- కోర్టును ఆశ్రయించిన బాధితులు
- అనుకూలంగా తీర్పురావడంతో భూమి అప్పగించాలని వినతి



నిజామాబాద్‌రూరల్: మల్లారంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాత్రి టౌన్‌షిప్‌లో రైతుల భూమి ఆక్రమణకు గురైంది. మల్లారంలోని పసుల నర్సింగ్‌రావు, పసుల మనోహర్‌లకు ధాత్రి టౌన్‌షిప్ వద్ద సుమారు మూడెకరాల భూమి ఉంది. అయితే గతంలో వెంచర్ చేస్తున్న సమయంలో అధికారులు బాధితులకు చెందిన భూమిలో రోడ్డు వేసి 16 గుంటల ఆక్రమించారు. ఈ విషయమై బాధితులు అధికారుల చుట్టూ ఏళ్ల తరబడి తిరిగినా ఫలితం లేకపోయింది. దీంతో ప్రజావాణిలోనూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. ఇటీవల కోర్టు వీరికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు కాపీలను అధికారులకు ఇచ్చినా కాలయాపన చేస్తున్నారని వాపోయారు. మంగళవారం తమ భూమిలో వేసిన రోడ్డును చదును చేయించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భూమిని తిరిగి అప్పగించాలని.. లేకపోతే తమకు ఆత్మహత్యే శరణమని ఆవేదన వ్యక్తం చేశారు.



చూసిందంతా నిజం కాదు..! ఈ చిత్రం చూస్తే రోడ్డుపై నుంచి నీరు పారుతున్నట్లు కనిపిస్తోంది. అయితే ఇదంతా భ్రమే..కొన్ని రోజులుగా ఎండలు మండుతుండడంతో రహదారులపై ఎండమావులు ఏర్పడుతున్నాయి. డిచ్‌పల్లి వద్ద 44 నంబర్ జాతీయ రహదారిపై ఇలా ఎండమావులు కనిపించాయి. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

మహా అనుసంధానం

- వేగంగా ఫోర్ వే రోడ్డు పనులు
- మంజీరపై భారీ వంతెన

బోధన్: జాతీయ రహదారి 63కు అనుసంధానం చేస్తూ బోధన్ పట్టణ శివారు నుంచి సాలూర అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు స్పీడ్ అందుకున్నాయి. ఏడాదిన్నర క్రితమే పనులను ప్రారంభించినప్పటికీ రెండు నెలల నుంచి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. తెలంగాణ – మహారాష్ట్ర మధ్య ప్రధాన మార్గమైన సాలూర అంతర్‌రాష్ట్ర రోడ్డు విస్తరణతో రెండు రాష్ట్రాల మధ్యనే కాకుండా.. ఉత్తర, దక్షిణ భారత దేశాల్లోని రాష్ట్రాలకు రవాణా సౌకర్యం మరింత సులభం కానుంది.

రోడ్డు విస్తరణ పనులు ఇలా..

బోధన్ పట్టణ శివారులోని మర్రిమైసమ్మ ఆలయం సమీపం నుంచి మండలంలోని నాగన్‌పల్లి, సాలూర క్యాంప్, సాలూర గ్రామాల మీదుగా సాలూర అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు వరకు 8.3 కిలో మీటర్ల వరకు నాలుగు వరుసల రోడ్డు విస్తరణ చేపట్టారు. పాత డబుల్ బీటీ రోడ్డు విస్తరణతోపాటు మూడు గ్రామాల శివార్లలో 4.5 కిలో మీటర్ల బైపాస్ రోడ్డు నిర్మిస్తున్నారు. ఇందుకోసం వ్యవసాయభూములను సేకరించి రైతులకు పరిహారం చెల్లించారు. నాగన్‌పల్లి గ్రామ శివారులోని పసుపువాగు పాత వంతెనకు ఎగువ భాగంలో హైలెవల్ వంతెన పనులు కొనసాగుతుండగా, బైపాస్ రోడ్డు పనులు వివిధ దశలో ఉన్నాయి. మరో రెండు, మూడు నెలల్లో బైపాస్ రోడ్డు, విస్తరణ పనులు పూర్తయ్యే అవకాశాలున్నాయి. రోడ్డు విస్తరణ పనులకు ప్రభుత్వం రూ.35 కోట్లు మంజూరు చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి.



సాలూర శివారులోని మంజీర నదిపై నిర్మించిన నాలుగు వరుసల రోడ్డు, సెంట్రల్ లైటింగ్

వంతెన నిర్మాణం

మంజీర నదిపై హై లెవల్ భారీ వంతెన నిర్మాణం దాదాపు పూర్తయ్యింది. నిజాం హయాంలో 1932నిర్మించిన వంతెన మీదుగా వర్షాకాలంలో నీరు ప్రవహించడంతో రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు నిలిచిపోయేవి. 1984–85లో ఉమ్మడి ఏపీ, మహారాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించి పాత వంతెనకు దిగువన హై లెవల్ వంతెనను నిర్మించగా, ఆ వంతెన సైతం దెబ్బతిని శిథిలావస్థకు చేరింది. నాలుగేళ్ల క్రితం మహారాష్ట్ర ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు గుర్తించి కొత్త వంతెన కోసం ప్రతిపాదనలు చేశారు. పాత లో లెవల్, హై లెవల్ వంతెన మధ్య కొత్త వంతెనను నిర్మించారు.

రూ.120 కోట్లతో..

రోడ్డు విస్తరణకు సంబంధం లేకుండా వంతెన నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.120 కోట్లు మంజూరు చేసింది. కాగా వంతెన నిర్మాణ పనులన్నింటినీ మహారాష్ట్ర ఇంజినీరింగ్ విభాగం పర్యవేక్షిస్తోంది. వంతెన పై నాలుగు వరుసల రోడ్డు ఉండే విధంగా రెండు వరుసల్లో వంతెన చేపట్టారు. వంతెనకు ఇరువైపులా కిలో మీటరు వరకు నాలుగు వరుసల రోడ్డు, డివైడర్లు నిర్మించారు. వంతెనపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. భారీ వంతెన నిర్మాణంతో మంజీర తీరంలో రూపురేఖలు మారిపోయాయి.

సేవా కేంద్రాలను పర్యవేక్షించాలి

- అర్హులందరికీ రూ. 500లకే గ్యాస్, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్‌నాగారం: ప్రజాపాలన సేవా కేంద్రాల నిర్వహణను పర్యవేక్షించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశించారు. మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాలను జిల్లాలోని అర్హులందరూ సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందేలా అధికారులు చొరవ చూపాలని సూచించారు. మంగళవారం ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా సాఫ్ట్‌వేర్‌లో వివరాల నమోదు విధానంపై కలెక్టర్లతో విద్యుత్ శాఖ కార్యదర్శి రిజ్వీ, ఇతర రాష్ట్రస్థాయి అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరాలు తెలియజేశారు. అనంతరం కలెక్టర్ ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ప్రజాపాలన సేవా కేంద్రాల ఆపరేటర్లతో వీసీలో మాట్లాడారు. ప్రజా పాలన సేవా కేంద్రాల ద్వారా అర్హులైన లబ్ధిదారుల వివరాలను సాఫ్ట్‌వేర్‌లో అప్‌డేట్ చేయించి ఆన్‌లైన్‌లో పంపించాలన్నారు. ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని.. అర్హులకు రూ. 500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజాపాలన దరఖాస్తు సమయంలో వివరాలు సరిగ్గా నమోదు చేయని దరఖాస్తుదారుల కోసం సేవా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరందు, జెడ్పీ సీఈవో ఉష, డిప్యూటీ సీఈవో సుందర వరదరాజన్, డీపీవో చక్రవర్తి తరుణ్ కుమార్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, కార్పొరేషన్ కమిషనర్

వైద్యారోగ్యశాఖలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌నాగారం: జిల్లా వైద్యారోగ్యశాఖలో మూడు పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో సుదర్శనం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎపిడమాలజిస్ట్–1, న్యూట్రీషన్ కౌన్సిలర్–1, జిల్లా ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ –1 పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 6 నుంచి 11 వరకు కలెక్టరేట్‌లోని 202 వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు. పూర్తివివరాలకు nizamabad. telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

వివాహిత ఆత్మహత్యతో ఉద్రిక్తత

- భర్త ఇంటిపై మృతురాలి బంధువుల దాడి..
- తలుపులు, ఇంట్లోని వస్తువులు ధ్వంసం
- న్యాయం చేయాలని సాయంత్రం వరకు కొనసాగిన నిరసన
- గ్రామానికి చేరుకున్న ప్రొబేషనరీ ఎస్పీ, డీఎస్పీ, సీఐలు, ఎస్సైలు
- పోలీస్ బందోబస్తు మధ్య మృతదేహం తరలింపు



అరుణ (ఫైల్)

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అత్తింటి వేధింపులు భరించలేక ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోగా.. ఆమె తరఫు బంధువులు విధ్వంసం సృష్టించారు. సదాశివనగర్ మండలం ధర్మారావ్‌పేట్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. దోమకొండ మండలం చింతమాన్‌పల్లికి చెందిన నీల అరుణ(21)ను ఏడాది క్రితం ధర్మారావ్‌పేట్ గ్రామానికి చెందిన దొంతర బోయిన అనిల్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. పెళ్లయిన నాటి నుంచి అరుణకు అత్తింటి వేధింపులు మొదలయ్యాయి. ఆమె భర్త ఇటీవల విదేశాల నుంచి వచ్చాడు. మంగళవారం వ్యవసాయ బావి వద్ద భోజనం ఇవ్వడానికి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో అరుణ మనస్తాపంతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయాన్ని గమనించిన చుట్టుపక్కల వారు తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లారు. అప్పటికే అరుణ మృతదేహం ఫ్యాన్‌కు వేలాడుతోంది. వెంటనే పోలీసులకు, మృతురాలి బంధువులకు సమాచారం అందించారు. ధర్మారావ్‌పేట్‌కు చేరుకున్న మృతురాలి బంధువులు ఇంట్లోని వస్తువులను, తలుపులను ధ్వంసం చేశారు. అక్కడికి చేరుకున్న ఎస్సై రాజు పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో స్పెషల్ ఫోర్సు బలగాలను రప్పించారు. ఆందోళన చేస్తున్న వారిని చెదరగొట్టారు. బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం ఇరువర్గాలతో మాట్లాడారు. అయితే న్యాయం జరిగే వరకు మృతదేహాన్ని తీసేది లేదని మృతురాలి బంధువులు స్పష్టం చేశారు. రూ. 60 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒప్పందం చేసుకున్న అనంతరం మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టంకు తరలించారు. మృతురాలి తండ్రి నీల స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు విచారణ అధికారి ప్రొబేషనరీ ఎస్పీ కాజల్ పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



జెడ్పీ స్థాయీ సంఘ సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు

- జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

నిజామాబాద్ రూరల్: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అందరికీ అందేలా కృషిచేయాలని జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో వివిధ శాఖలపై నిర్వహించి స్థాయీ సంఘ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ప్రజా పాలన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో అధికారులు ప్రొటోకాల్‌ను పాటించాలని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పంచాయతీల్లో పరిశుభ్రతను పాటించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నర్సరీల్లో మొక్కలను సంరక్షించే బాధ్యత పంచాయతీలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇసుక క్వారీలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి అక్రమ రవాణా జరుగకుండా చూసుకోవాలని మైన్స్‌శాఖ అధికారుకు సూచించారు. సమావేశాల్లో జెడ్పీ వైస్ చైర్మన్ రజిత ఎల్లయ్య యాదవ్, జెడ్పీ సీఈవో ఉష, డిప్యూటీ సీఈవో సుందర వరదరాజన్, జెడ్పీటీసీ సభ్యులు సిరికొండ మాన్సింగ్, రుద్రూర్ నారోజి గంగారం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు

- సీనియర్ హెచ్‌ఎంలకే సీఎస్‌వో, డీవోల బాధ్యతలు
- 140 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- సెల్‌ఫోన్‌లపై పూర్తిగా నిషేధం
- ఏర్పాట్లు చేస్తున్న జిల్లా విద్యాశాఖ

నిజామాబాద్‌అర్బన్: పదో తరగతి పరీక్షలు ఈనెల 18 నుంచి 30వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎలాంటి లోపాలకు తావులేకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు విద్యాశాఖ యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. పరీక్షల నిర్వహణ కోసం ఉన్నతాధికారులు 140 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈసారి పరీక్ష కేంద్రాలకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లుగా సీనియర్ ప్రధానోపాధ్యాయులను మాత్రమే కేటాయించారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే పరీక్ష కేంద్రాలను గుర్తించిన అధికారులు పరీక్షల నిర్వహణ అధికారులకు రెండు దఫాలుగా శిక్షణ ఇచ్చారు. ముఖ్యంగా సెల్‌ఫోన్లపై నిషేధం, ఎలక్ట్రానిక్ వస్తువులను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దని శిక్షణలో వివరించారు. మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన ఏర్పాట్లను కూడా పూర్తిచేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ సెంటర్ల నిర్వాహకులతో నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారు.



నగరంలోని ఖిల్లా పాఠశాల పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లపై సూచనలిస్తున్న డీఈవో

మాస్ కాపీయింగ్ నిరోధానికి ఏర్పాట్లు

పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా గట్టి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం కేంద్రాల వద్ద పర్యవేక్షణతో పాటు, సీసీ కెమెరాల వినియోగం, ప్రశ్నాపత్రాలు సెంటర్‌కు వచ్చిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లో సెల్‌ఫోన్లు ఉపయోగించకుండా చూడడం లాంటి చర్యలు తీసుకోనున్నారు. పరీక్ష కేంద్రాల వల్ల 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. బయటి వ్యక్తులను లోపలికి అనుమతించబోరు. జిరాక్స్ సెంటర్లను సైతం మూసివేయించనున్నారు.

మేనేజ్‌మెంట్	స్కూళ్ల సంఖ్య	విద్యార్థులు
ఎయిడెడ్	7	485
ఆశ్రమ	3	34
బీసీ వెల్ఫేర్	12	766
ప్రభుత్వ	25	1120
కేజీబీవీ	25	835
ప్రైవేటు	191	8695
మైనారిటీ	17	684
మోడల్	10	945
రెసిడెన్షియల్	3	207
సోషల్ వెల్ఫేర్	9	677
ట్రైబల్ వెల్ఫేర్	2	147
జెడ్పీ	224	7298
మొత్తం	528	21,893

పరీక్ష రాయనున్న 21,893 మంది విద్యార్థులు

జిల్లాలో ఏడాది పదో తరగతి పరీక్షలకు సంబంధించి 21,893 మంది పరీక్షలు రాయనున్నారు ఇందులో బాలురు 11,158, బాలికలు 10,735 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. ప్రైవేటుగా 380 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటలకు వరకు ఎగ్జామ్స్ కొనసాగుతాయి. ఈసారి నూతనంగా సైన్స్ సబ్జెక్టుకు సంబంధించి బయోలాజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్ పరీక్షలు వేర్వేరు రోజుల్లో నిర్వహించనున్నారు. ఈ పరీక్ష ఉదయం 9:30 గంటల నుంచి 11 గంటల వరకు కొనసాగనుంది. హిందీ పరీక్ష మాత్రం మధ్యాహ్నం 12.50 గంటల వరకు జరగనుంది. అరగంట ముందుగానే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది. ప్రశ్నాపత్రాలు రెండు రోజుల క్రితమే జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి.

“ ఏర్పాట్లు పూర్తిచేశాం



పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తాం. ఎలాంటి లోపాలు జరుగకుండా చర్యలు తీసుకుంటున్నాం. మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా చేస్తున్నాం. ఇప్పటికే పరీక్ష నిర్వహణ అధికారులకు శిక్షణ ఇచ్చాం. సెల్‌ఫోన్ల పూర్తిగా నిషేధించడం జరిగింది.

– దుర్గాప్రసాద్, డీఈవో

21న అవిశ్వాస పరీక్ష

- డీసీసీబీ చైర్మన్ భాస్కర్ రెడ్డిపై..
- నోటీసులు జారీ చేసిన డీసీవో శ్రీనివాస్

డొంకేశ్వర్(ఆర్మూర్): నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డిపై అవిశ్వాస పరీక్షకు తేదీ ఖరారైంది. ఈ నెల 21న డీసీసీబీ పాలకవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు చైర్మన్‌తో పాటుగా డైరెక్టర్లకు జిల్లా సహకార శాఖ అధికారి(డీసీవో) శ్రీనివాస్ మంగళవారం నోటీసులు జారీ చేశారు. డీసీసీబీ బ్యాంకుకు వెళ్లిన ఆయన రికార్డులను పరిశీలించారు. డైరెక్టర్ల సంతకాలు సరైనవో కాదో సరి చూసుకున్నారు. భాస్కర్ రెడ్డి తమకు చైర్మన్‌గా వద్దని సోమవారం 15 మంది డైరెక్టర్లు డీసీవోకు లేఖను అందజేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా సహకార శాఖ నిబంధనల ప్రకారం చైర్మన్‌పై అవిశ్వాస పరీక్షకు డీసీవో కసరత్తు చేపట్టారు. అయితే అవిశ్వాసం పెట్టిన డైరెక్టర్లు ఇంకా క్యాంపులోనే ఉన్నారని తెలుస్తోంది. అవిశ్వాస పరీక్షను నెగ్గి చైర్మన్ పదవిని కాపాడుకోవడానికి భాస్కర్ రెడ్డికి పక్షం రోజుల పాటు సమయం ఉంది. ఈలోపు డీసీసీబీ రాజకీయ ఇంకెన్ని మలుపులు తిరుగుతుందో వేచి చూడాల్సిందే.

క్లుప్తంగా

హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ విశాఖనగర్‌లో మంగళవారం ఉమ్మడి జిల్లా జూనియర్ మెన్ హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జట్టుకు ఎంపిక చేసినట్లు నిజామాబాద్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగా మోహన్‌చక్రు, ప్రధాన కార్యదర్శి పింజ సురేందర్ తెలిపారు. వరంగల్ జిల్లాలో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్న 45వ తెలంగాణ రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడాకారులు పాల్గొంటారని వారు తెలిపారు. కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కోశాధికారి గటాడి రాజేశ్, హాకీ సంఘం ప్రధాన కార్యదర్శి సదమస్తుల రమణ, పీఈటీలు అంజు, సంజీవ్, నవీన్, రాహుల్, అనూష తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరం



సిరికొండ: వివక్షతో కూడిన లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని వీటిని నివారించాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రసూల్ బీ అన్నారు. మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటి పడావో కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. బాలికల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. బాల్యవివాహాలను నిరోధించాలని సూచించారు. బాలికలకు విద్య అవకాశాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్‌రావు, ఎంపీడీవో లక్ష్మీప్రసాద్, సీడీపీవో స్వర్ణలత, డీసీవో చైతన్య, సూపర్‌వైజర్లు ప్రియదర్శిని, సవిత, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ రాంబాబు, హెడ్ కానిస్టేబుల్ శంకర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఒక్కొక్కరికి మూడు ఉద్యోగాలు



జైపాల్



స్రవంతి

బోధన్: సాలూర మండలం కుమ్మన్‌పల్లికి చెందిన కానుగుల జైపాల్, జక్రాన్‌పల్లి మండలం పడకల్‌కు చెందిన గుద్దేటి స్రవంతి ఒకేసారి మూడు ఉద్యోగాలు సాధించారు. ఇటీవల విడుదలైన గురుకుల ఉద్యోగాల ఫలితాల్లో జైపాల్, స్రవంతి జేఎల్, టీజీటీ, పీజీటీ ఉద్యోగాలు పొందారు. జైపాల్ నిజామాబాద్‌లోని తెలంగాణ మైనార్టీ బాయ్స్ జూనియర్ కళాశాల -2లో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన జూనియర్ లెక్చరర్‌గా పనిచేస్తుండగా, స్రవంతి హైదరాబాద్‌లో ఉంటూ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యారు. కుమ్మన్‌పల్లి , పడకల్ గ్రామస్తులు ఇరువురినీ అభినందించారు.

ప్రైవేట్ వెంచర్‌కు ప్రభుత్వ వంతెనలు

- రియల్టర్ల కోసం టీయూఎఫ్ఐడీసీ నిధుల మళ్లింపు!
- ఎస్టిమేషన్ లేకుండానే విద్యుత్‌లైన్లు
- ప్రతిఫలంగా అప్పటి ప్రజాప్రతినిధికి రోడ్డు పక్కన 1500 గజాలు గిఫ్ట్



మానిక్‌బండార్ వద్ద వెంచర్ ముఖద్వారం

మాక్లూర్: అక్రమాల్లో ఆరితేరారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ప్రజాప్రతినిధి అండతో నగరానికి ఆనుకొని భారీ వెంచర్ రూపుదిద్దుకోగా.. ప్రభుత్వ నిధులను అడ్డగోలుగా దానికోసం ఉపయోగించారనే ఆరోపణలున్నాయి. సదరు ప్రజాప్రతినిధికి ఉన్న 'ఆశ'ను క్యాష్ చేసుకోవాలనుకున్న రియల్టర్లు అతగాడికి రోడ్డు పక్కనే 1500 గజాల భూమిని గిఫ్ట్‌గా ఇచ్చినట్లు సమాచారం. 'ఆశ' వెంచర్ నిర్మాణానికి దారిచూపింది. అధికార బలం ఉపయోగించి రైతుల భూముల్లో గద్దల్లా వాలిన రియల్టర్లు భూమి విక్రయించేందుకు నిరాకరించిన రైతులను బెదిరించారు. భారీ వెంచర్ నిజామాబాద్ నగర పరిధిలోని రెండో డివిజన్‌లో ఉన్నప్పటికీ.. రెవెన్యూ శివారుమాత్రం మాక్లూర్ మండలం మానిక్‌బండార్ పరిధిలో ఉంది. వ్యవసాయభూములను ప్లాట్లుగా మార్చేందుకు అవసరమైన మొరం కోసం మాక్లూర్ శివారులోని గుట్టలను తవ్వేశారు. విద్యుత్ అధికారులను బెదిరించి ఎస్టిమేషన్ లేకుండానే విద్యుత్‌లైన్లు వేసినట్లు తెలిసింది.

చెరువుశిఖం, దేవాదాయ భూమి ఖతం

సర్వే నంబర్ 499లోని దేవాదాయ శాఖకు చెందిన 30గుంటల భూమి, 480లో 14 గుంటలు, 477లో 2 ఎకరాల 5 గుంటలు, 503లో 19 గుంటలు, 548లో 29 గుంటలు మొత్తం 4 ఎకరాల 7 గుంటల భూమితోపాటు సమీపంలోని బచ్చల చెరువు శిఖం 3 నుంచి 4 ఎకరాల వరకు ఉన్న భూమిని వెంచర్‌లో కలిపేసినట్లు ఆరోపణలున్నాయి. ప్రశ్నించిన మానిక్‌బండార్ గ్రామస్తులను బెదిరించి నోళ్లు మూయించారు. స్థానిక బీఆర్ఎస్ నాయకుడు వెంచర్ యాజమాన్యానికి సహకరించారనే విమర్శలు ఉన్నాయి.

టీయూఎఫ్ఐడీసీ నిధులతో వంతెనలు

పట్టణ ప్రాంతాల్లో కనీస సదుపాయాల కల్పన కోసం వెచ్చించాల్సిన తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీయూఎఫ్ఐడీసీ) నిధులను దారి మళ్లించి భారీ వెంచర్ కోసం వంతెనలు వేశారనే ఆరోపణలున్నాయి. భారీ వెంచర్‌లోకి వెళ్లాలంటే ఆర్టీసీ కాలనీలోని మహాలక్ష్మి కాలనీ వద్ద, గూపన్‌పల్లి గుండువాగు వద్ద రెండు భారీ వంతెనలు నిర్మించాలి. వాగు అవతల వెంచర్లు వేసిన రియల్టర్లు సొంత డబ్బులతో వంతెనలు నిర్మించాలి. కానీ మాజీ ప్రజాప్రతినిధి అండతో 'విలీన గ్రామాల అభివృద్ధి కోసం..' అని టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.10కోట్లు దారి మళ్లించి వంతెనలు నిర్మించారు. ప్రస్తుతం నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయి. భార వెంచర్ అక్రమాలపై స్థానిక కార్పొరేటర్ రాయ్ సింగ్ ఇప్పికే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

విద్యార్థులకు జిల్లాస్థాయి పోటీలు



ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు

నిజామాబాద్‌అర్బన్: నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో మంగళవారం కోటగల్లీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి సైన్స్ డ్రామా, మోనో యాక్షన్ పోటీలు నిర్వహించారు. నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో ఆల్టర్నేటివ్ టు ప్లాస్టిక్ అను ప్రధానాంశంలో ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ విధానాలు సూచించే విధంగా సైన్స్ డ్రామా యాక్షన్‌ను విద్యార్థులతో చేయించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 20 పాఠశాలల నుంచి 100 మంది విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్జీసీ స్టేట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ విద్యాసాగర్ మాట్లాడుతూ.. సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ని వాడితే అనేక అనర్థాలు సంభవిస్తున్నాయని అన్నారు. ఆల్టర్నేటివ్ ప్లాస్టిక్ అనే అంశంపై విద్యార్థులకు మోనో యాక్షన్, డ్రామా పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు తమ పాఠశాలలో, తమ ఇంటి పరిసరాలలో ఇతరులకు ఈ అంశంపై అవగాహన కలిగించి మార్పు కోసం ప్రయత్నించాలన్నారు. అనంతరం విజేతలకు నగదుతో పాటు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వాసుదేవ రావు, టీపీటీఎఫ్ సురేశ్, మల్లేశం, విద్యార్థులు, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదు

- ఇంటర్‌పరీక్షలకు 510 మంది గైర్హాజరు

నిజామాబాద్ అర్బన్: ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షల్లో భాగంగా మంగళవారం గణితం 2ఏ, బోటనీ, పొలిటికల్ సైన్స్ (సివిక్స్) పరీక్షలు జరిగాయి. జిల్లా కేంద్రంలోని హరిచరణ్ జూనియర్ కళాశాల సెంటర్‌లో ఓ విద్యార్థిపై మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదైంది. మొత్తం 17,082 మందికి గాను 16,572 మంది హాజరుకాగా, 510మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. 50 పరీక్షా కేంద్రాలను జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ, స్క్వాడ్‌లు తనిఖీ చేశారు.

ఆలస్యంగా వచ్చిన విద్యార్థి వెనక్కి.

మాక్లూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌కు ఓ విద్యార్థి 9.10నిమిషాలకు రావడంతో అధికారులు అతడిని పరీక్ష రాసేందుకు అనుమతించలేదు. సదరు విద్యార్థిని అక్కడే ఉంచి అతడి తల్లిదండ్రులకు సమాచారమిచ్చి వారికి అప్పగించారు.

జహీరాబాద్‌ను కైవసం చేసుకోవాలి

- పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేద్దాం
- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



నాయకులతో సుదర్శన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి

బాన్సువాడ : పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకొని కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం బాన్సువాడలో నిర్వహించిన కార్యక్రమంలో నస్రుల్లాబాద్ మండలానికి చెందిన సొసైటీ చైర్మన్, మాజీ సర్పంచులు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీటీసీలు భారీ సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరారు. వారంతా నస్రుల్లాబాద్ నుంచి భారీ బైక్ ర్యాలీతో బాన్సువాడకు చేరుకున్నారు. కొయ్యగుట్ట పీఆర్ గార్డెన్‌లో నిర్వహించిన ఘర్‌వాపసీ కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ధరణి పేరుతో అక్రమాలు చేశారని ఆరోపించారు. ధరణి సమస్యలను పరిష్కరించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి తహసీల్దార్లు, ఆర్డీవోలు, కలెక్టర్లకు బాధ్యతలు అప్పగించారన్నారు. కేసీఆర్ హయాంలో నిరుద్యోగుల, రైతులకు కన్నీరు మిగిలిందని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ గడుగు గంగాధర్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నగేశ్‌రెడ్డి, వ్యాపారవేత్త శ్రీనివాస్‌రావు, నాయకులు నందురెడ్డి, ప్రతాప్‌సింగ్, మాసాని శ్రీనివాస్‌రెడ్డి, నార్ల రత్నకుమార్, యలమంచలి శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, పాత బాలకృష్ణ, శ్రీనివాస్‌యాదవ్, కిశోర్‌యాదవ్, నారాగౌడ్, రమేశ్, లాయక్, అక్బర్, నరేశ్‌రాథోడ్, నార్ల సురేశ్, నార్ల రాఘవేందర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు

పలువురు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు సుదర్శన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. దుర్కి సొసైటీ చైర్మన్, జిల్లా గ్రంథాలయల సంస్థ మాజీ చైర్మన్ దివిటి శ్రీనివాస్ యాదవ్, మాజీ జెడ్పీటీసీ కిశోర్‌యాదవ్, మాజీ సర్పంచులు నారాగౌడ్, బద్యానాయక్, అరిగే అంబయ్య, అంగోత్ మంజుల, వాజీద్, కుమ్మరి నారాయణ, బీర్కూర్ మండలం కిష్టాపూర్, బైరాపూర్, మల్లాపూర్‌కు చెందిన వారు కాంగ్రెస్‌లో చేరారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి



మృతుడు వెంకట రమణ (ఫైల్)

కామారెడ్డి క్రైం: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమై రెండు రోజుల తర్వాత చెరువులో శవమై తేలిన ఘటన కామారెడ్డిలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గాంధారికి చెందిన గుర్రం వెంకటరమణ(27) తన తల్లి, భార్యతో కలిసి దేవునిపల్లిలోని బంధువుల ఇంటికి ఈ నెల 2న వచ్చాడు. మరుసటి రోజు అతని తల్లి, భార్య గాంధారికి తిరిగి వెళ్లగా అతను మాత్రం దేవునిపల్లిలోనే ఉన్నాడు. ఇప్పుడే వస్తానని చెప్పి బయటకు వెళ్లిన వెంకటరమణ తిరిగి రాలేదు. కామారెడ్డి పెద్ద చెరువు వద్ద బైక్, చెప్పులు కనిపించడంతో కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించడంతో కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహం ఉదయం బయటకు తేలింది. ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొమురయ్య పేర్కొన్నారు.

ఇసుక రవాణాకు రెక్కలు

- ఎస్సై లేకపోవడంతో యథేచ్ఛగా అక్రమ దందా
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న కిందిస్థాయి సిబ్బంది



రెండు రోజుల క్రితం పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

రెంజల్(బోధన్): మండలంలో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. పోలీస్ కమిషనర్ కొరడా ఝుళిపించడంతో కొన్ని రోజులపాటు తోక ముడిచిన ఇసుక మాఫియా యథేచ్ఛగా 'దందా' కొనసాగిస్తోంది. స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఎస్సై లేకపోవడం అక్రమార్కులకు వరంగా మారింది. ప్రతిరోజూ అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు ఇసుక అక్రమంగా రవాణా అవుతున్నా పట్టించుకునే వారులేరని మండల వాసులు వాపోతున్నారు. ఎస్సై ఉదయ్‌కుమార్ 20 రోజుల క్రితం బదిలీపై వెళ్లినప్పటికీ ఆయన స్థానంలో ఎవరూ రాకపోవడంతో ఆడిందే ఆట పాడిందే పాట చందంగా మారింది. గతంలో అర్ధరాత్రి వేళల్లో ఇసుక టిప్పర్ల రాకపోకలతో మండలంలోని కందకుర్తి, పేపర్‌మిల్, నీలా గ్రామాల ప్రజలు నిద్రలేని రాత్రులు గడిపారు. ఈ వ్యవహారంపై సీపీ కల్మేశ్వర్ సీరియస్‌కావడంతో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడింది. పోలీసులు ఎక్కడికక్కడ వాహనాలను సీజ్ చేస్తూ కేసులు నమోదు చేశారు. పోలీసుల దాడులకు భయపడి ఇసుక వ్యాపారులు తోక ముడిచారు. ఎస్సై బదిలీపై వెళ్లడంతో మళ్లీ వారి అక్రమ దందాకు రెక్కలొచ్చాయి. కిందిస్థాయి పోలీసు సిబ్బంది అందినకాడికి దండుకుంటూ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నామమాత్రంగా జరిమానాలు విధిస్తూ వాహనాలను వదిలేస్తున్నారని పలువురు అంటున్నారు. మండలంలోని వాగులు, నదుల నుంచి ఇసుక యథేచ్ఛగా పక్క జిల్లాలకు తరలిస్తున్నారని, టాస్క్‌ఫోర్స్ పోలీసులు వచ్చి పట్టుకునే వరకు ఇక్కడి అధికారయంత్రాగానికి సోయి ఉండడం లేదని విమర్శిస్తున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన పలువురు ఎస్సైలు ఇసుక వ్యాపారులతో కుమ్మక్కై వివాదాల్లో చిక్కుకున్నారు. ఈనేపథ్యంలో రెంజల్‌కు ఎస్సైగా వచ్చేందుకు ఎవరూ సాహసించడం లేదని తెలుస్తోంది.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



ఇందల్వాయి: మండలం వెంగల్‌పాడు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై మనోజ్ తెలిపారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మోహన్ సమాచారం మేరకు మంగళవారం ఉదయం ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్సై తెలిపారు.

బీజేపీ నుంచి కార్పొరేటర్ సస్పెండ్

నిజామాబాద్‌నాగారం: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడారనే కారణంతో కార్పొరేషన్ పరిధిలో 19వ డివిజన్ కార్పొరేటర్ మీసాల సవితను బీజేపీ సస్పెండ్ చేసింది. పార్టీ నిబంధనలు ఉల్లంఘించడంతోపాటు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడంతో ఆమెను సస్పెండ్ చేసి షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సస్పెన్షన్ తక్షణమే అమల్లోకి వస్తుందని వారంరోజుల్లోగా లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని కోరారు.

ఉత్సాహంగా విద్యుత్ క్రీడలు



టగ్ ఆఫ్ వార్‌లో తలపడుతున్న క్రీడాకారులు

నిజామాబాద్‌నాగారం: విద్యుత్ ఉద్యోగుల రాష్ట్రస్థాయి క్రీడలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. రెండో రోజైనా మంగళవారం పోలీస్ పరేడ్ మైదానంలో అథ్లెటిక్స్, టగ్ ఆఫ్ వార్, ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఎస్ఈ రవీందర్, డీఈలు శ్రీనివాస్‌రావు, వెంకటరమణ, స్పోర్ట్స్ కార్యదర్శి గోపి, కోశాధికారి ఉత్తమ్, తోట రాజశేఖర్, గంగారాంనాయక్, సురేశ్‌కుమార్, మూర్తి, దినేశ్, పఠాన్, చంద్రవర్మ తదితరులు క్రీడాపోటీలను పర్యవేక్షించారు.

అథ్లెటిక్స్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారు..

హైజంప్: సాయికృష్ణ(వికారాబాద్), యశ్వంత్(హబ్సిగూడ), సాయికుమార్(ఆదిలాబాద్).

లాంగ్‌జంప్ : దినేశ్(నిజామాబాద్), నాగు(వరంగల్), గోపి(నిజామాబాద్)

జావిలిన్ త్రో : ఉపేందర్(ఖమ్మం), మారుతి(నల్గొండ), అనిల్(నల్గొండ)

డిస్కస్ త్రో : మహ్మద్‌కమర్(నిజామాబాద్), ఎంవీ కృష్ణారావు (ఖమ్మం), సందీప్(వరంగల్)

నేటి ఫైనల్‌మ్యాచ్‌లు..

ఫుట్‌బాల్ : ఫైనల్స్‌లో వరంగల్ – మహబూబ్‌నగర్ జట్లు, తృతీయస్థానం కోసం నిజామాబాద్ – కరీంనగర్ జట్లు తలపడనున్నాయి.

టగ్ ఆఫ్ వార్ : ఫైనల్స్‌లో నిజామాబాద్ – హైదరాబాద్ సౌత్ జట్లు, తృతీయ స్థానం కోసం కరీంనగర్ – వరంగల్ జట్లు తలపడనున్నాయి.

అమెరికా నుంచి వచ్చి అనంతలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో మంథని యువకుడి మృతి
- మరొకరికి తీవ్రగాయాలు



శ్రావణ్‌గౌడ్ (ఫైల్)

ఆర్మూర్‌టౌన్: రోడ్డు పక్కన నిలిపి ఉన్న ఆటోట్రాలీని బైక్ ఢీకొట్టిన ఘటనలో మంథని గ్రామానికి చెందిన యువకుడు వేంపల్లి శ్రావణ్‌గౌడ్ (27) మృతి చెందగా, అతడి స్నేహితుడు తీవ్రగాయాల పాలయ్యాడు. ఈ ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. అమెరికాలో ఉద్యోగం చేస్తున్న శ్రావణ్‌గౌడ్ నెల రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. తన స్నేహితుడు అన్వేష్‌గౌడ్‌తో కలిసి బైక్‌పై పిప్రిలోని బంధువు ఇంటికి వెళ్లి తిరిగివస్తుండగా ఆర్మూర్ మండలం పిప్రి శివారులో ఆటోట్రాలీని ఢీకొట్టారు. గాయాలపాలైన యువకులను 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, శ్రావణ్ అప్పటికే మృతి చెందాడు. అన్వేష్ ఓ ప్రైవేట్‌ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శ్రావణ్‌గౌడ్ ఈనెల 12వ తేదీన తిరిగి అమెరికా వెళ్లాల్సి ఉండగా ఈ ఘోరం జరిగింది. శ్రావణ్ మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



క్రైం కార్నర్

'ఏటీఎం' మోసాలకు పాల్పడిన ఒకరి అరెస్ట్

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని పలు ఏటీఎం సెంటర్లలో అమాయక ప్రజలను మోసం చేసి, వారి ఏటీఎం నుంచి డబ్బులను దండుకున్న రమేశ్ అలియాస్ బగ్గిలి రాజును అరెస్ట్ చేసినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం జంగంపల్లికి చెందిన రమేశ్ ఇటీవల నగరంలోని ఒకటవ పరిధిలోని మూడు ఏటీఎం సెంటర్‌లో చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. డబ్బులు డ్రా చేసేందుకు ఏటీఎం సెంటర్లకు వచ్చిన అమాయక ప్రజలకు మాయమాటలు చెప్పి వారి ఏటీఎంను దొంగిలించి అకౌంట్‌లో ఉన్న డబ్బులను డ్రా చేసేవాడని చెప్పారు. మంగళవారం ఉదయం ఒకటో టౌన్ పీఎస్ పరిధిలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా అనుమానం వచ్చి అదుపులోకి తీసుకొని విచారించినట్లు తెలిపారు. దీంతో ఏటీఎంలలో చోరీకి పాల్పడినట్లు నిందితుడు ఒప్పుకున్నట్లు చెప్పారు. మూడు కేసుల్లో రూ. 30 వేల నగదు రికవరీ చేసి, నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ఐకేపీ అధికారిపై దాడి.. కేసు నమోదు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఐకేపీ సిబ్బందిపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ మంగళవారం తెలిపారు. మండలంలోని సోమార్‌పేట్‌కు చెందిన పందిటి అనురాధా స్త్రీ నిధి రుణం తీసుకుని తిరిగి చెల్లించక పోవడంతో ఐకేపీ అసిస్టెంట్ మేనేజర్ కొండం శ్రీనివాస్ డబ్బులు చెల్లించాలని కోరాడు. దీంతో అనురాధ భర్త బాలకృష్ణ అసిస్టెంట్ మేనేజర్‌పై దాడి చేశాడని, బాధితుడి ఫిర్యాదు మేరకు బాలకృష్ణపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గోడకు కన్నం వేసి సెల్‌ఫోన్లు చోరీ



ఖలీల్‌వాడి: నగరంలోని తిలక్ గార్డెన్‌లో మున్సిపల్ కాంప్లెక్స్‌లో ఉన్న శ్రీ వేంకటేశ్వర మొబైల్ షాప్‌లో సోమవారం రాత్రి షాపు వెనుక భాగంలో గోడకు కన్నం వేసి దుండగులు చోరీకి పాల్పడ్డారు. మంగళవారం ఉదయం షాపు తీసేందుకు వెళ్లిన యాజమాని చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దుండగులు మొబైల్ షాప్‌లో ఉన్న సీసీ కెమెరాలకు సంబంధించిన వైర్లను కత్తిరించి చోరీకి పాల్పడ్డారు. ఈ చోరీలో విలువైన సెల్‌ఫోన్‌లను ఎత్తుకెళ్లినట్లు యజమాని తెలిపారు. పోలీసులు, క్లూస్ టీం ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

బైక్ అదుపు తప్పి ఇద్దరికి గాయాలు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని అయ్యపల్లితండా సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఇద్దరికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. భవానీపేటకు చెందిన బోరంచ సంగప్ప తన భార్య విజయతో కలిసి మెదక్ నుంచి స్వగ్రామానికి వస్తుండగా బైక్ అదుపుతప్పి కిందపడిపోయారు. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలుకాగా, వారిని చికిత్స నిమిత్తం 108 అబులెన్స్‌లో ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

యువతి అదృశ్యం

ఎల్లారెడ్డి: మండలంలోని అడివిలింగా గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైనట్లు ఎస్సై మహేశ్ మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన ధనావత్ సుమిత్ర(18) గత నెల 29న రాత్రి సమయంలో ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి బయటికి వెళ్లిందన్నారు. బంధువుల ఇళ్లలో గాలించినప్పటికీ ఆమె ఆచూకీ లభించకపోవడంతో, కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చోరీ కేసులో తొమ్మిది నెలల జైలు

బాన్సువాడ రూరల్: ద్విచక్ర వాహనం చోరీ కేసులో మండలంలోని దేశాయిపేట్‌కు చెందిన తౌతి విఠల్‌కు న్యాయస్థానం తొమ్మిది నెలల జైలుశిక్షతోపాటు జరిమానా విధించింది. బాన్సువాడ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ భార్గవి మంగళవారం తీర్పు వెలువరించారు. సరైన సాక్ష్యాలు, ఆధారాలతో దోషికి శిక్ష పడేలా వ్యవహరించిన పోలీసులను అభినందించారు.

మోసానికి గురైన బాలిక ఆత్మహత్య

- నిందితుడిపై పోక్సో కేసు నమోదు

లింగంపేట(ఎల్లారెడ్డి): ప్రేమ పేరిట మోసానికి గురైన కామారెడ్డి జిల్లా లింగంపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలిక ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. బాలిక ఇంటర్మీడియట్ చదువుతుంది. అదే గ్రామానికి చెందిన యువకుడు కొడబోయిన అశోక్ రెండేళ్లుగా బాలికతో ప్రేమ వ్యవహారం నడిపాడు. ఈ క్రమంలో బాలిక గర్భవతి కావడంతో తనను పెళ్లి చేసుకోవాలని యువకుడిని కోరింది. అశోక్ పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపానికి గురైన బాలిక మంగళవారం ఉదయం ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుంది. నిందితుడు అశోక్‌పై పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


మనస్తాపంతో వృద్ధురాలు..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని శాస్త్రీనగర్‌లో భూక్యా కమల అనే వృద్ధురాలు మనస్తాపంతో సోమవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. శాస్త్రీనగర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్న కమల కూలీ పని చేస్తూ జీవిస్తోంది. ఇంట్లోని దూలానికి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

కుటుంబ కలహాలతో..

కామారెడ్డి క్రైం: కుటుంబ కలహాల కారణంగా ఓ మహిళ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని అడ్లూర్ గ్రామానికి చెందిన అబ్బుగారి మమత (36)కు ఆమె భర్తతో కొద్దిరోజులుగా చిన్నపాటి గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన మమత మంగళవారం సాయంత్రం గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి భర్త రవి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనాస్థలాన్ని రైల్వే ఎస్సై తావూనాయక్ పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

తాళాలు వేసిన ఇళ్లలో చోరీ



వేల్పూర్ మండల కేంద్రంలో..

వేల్పూర్/రుద్రూర్ : వేల్పూర్, కోటగిరి మండల కేంద్రాల్లో తాళాలు వేసిన ఇళ్లలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. వేల్పూర్‌కు చెందిన సుర్బిర్యాల శారద ఇంటికి తాళం వేసి పక్కనే ఉన్న సోదరుని ఇంట్లో నిద్రపోయింది. ఇంటి తాళం పగులగొట్టిన దుండగులు మూడు గ్రాముల బంగారం, రూ.10వేల నగదు ఎత్తుకెళ్లారు. అలాగే రాజు కిరాణా దుకాణంలో రూ.4వేల నగదు చోరీ చేశారు. మరో రెండు ఇళ్లలో చోరీకి విఫలయత్నం చేశారు.

కోటగిరి మండల కేంద్రానికి చెందిన శివయ్య ఇంటి తాళలు పగులగొట్టిన దుండగులు బీరువాలోని ఆరుతులాల వెండి ఉంగరాలు, 12తులాల వెండి పట్టగొలుసులు ఎత్తుకెళ్లారు. మూడు నెలలుగా శివయ్య ఆర్మూర్ మండలం మంతెన గ్రామంలో ఉంటున్నాడు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. సమీపంలోని మరో రెండిళ్ల తాళాలు పగులగొట్టినప్పటికీ విలువైన వస్తువులు చోరీ కాలేదని ఎస్సై సందీప్ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.